
సాక్షి ఒడిశా

సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,10,176
బంగారం	150 మిల్లీ గ్రాములు
వెండి	33 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ఒడిస్సీ నృత్య రూపకం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రథమ విశ్వ ఒడియా భాషా సమ్మేళని అదరహో అనిపిస్తోంది. భాష, సంస్కృతి పుట్టుపూర్వోత్తరాల్ని ప్రదర్శిస్తున్నారు.

- 8లో



కన్యకా పరమేశ్వరి ఆలయంలో చోరీ

జయపురంలోని మహారాణిపేటలో కళింగ వైశ్యుల ఆరాధ్య దైవం కన్యాకా పరమేశ్వరి ఆలయంలో శనివారం చోరీ జరిగింది.

- 8లో

బడ్జెట్‌కు వేళాయె..!



- నేటి నుంచి మధ్యంతర బడ్జెట్ సమావేశాలు
- అధికార, విపక్షాలు సిద్ధం
- చివరి సమావేశాలు కావడంతో సర్వత్రా ఆసక్తి

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి విక్రమ్ కేశరీ అరుఖ్ మధ్యంతర బడ్జెట్‌ను సభలో ప్రవేశ పెట్టనున్నారు. అత్యంత స్వల్ప నిడివితో ఈ విడత సమావేశాల కార్యక్రమాలు ఖరారు కావడం విశేషం. ఈ నెల 5తో ప్రారంభం కానున్న ఈ సమావేశాలు 13వ తేదీతో ముగియనున్నాయి. ప్రస్తుత శాసన సభకు ఈ సమావేశాలు చివరికి కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు మధ్యంతర బడ్జెట్ కోసం ఏర్పాటు అవుతున్న ఈ సమావేశాలను అధికార, విపక్షాలు అత్యంత కీలకంగా పరిగణిస్తున్నాయి.

అఖిలపక్ష సమావేశం..

మధ్యంతర బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని శాసన సభ స్పీకర్ ప్రమీలా మల్లిక్ అఖిలపక్ష సమావేశానికి ఆదివారం పిలుపునిచ్చారు. సమావేశాలు సజావుగా కొనసాగించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ప్రధాన పక్షాలు బిజీ బిజీ..

వాస్తవానికి మధ్యంతర బడ్జెట్ సమావేశాలకు ముందు ఏ రాజకీయ పార్టీ తమ ఎమ్మెల్యేల సమావేశాలను ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. సభా కార్యక్రమాలు ప్రారంభానికి కొన్ని గంటల ముందుగా అధికార పక్షం బిజూ జనతా దళ్ శాసన సభ్యులతో సమావేశం కావడం ఆనవాయితీగా కొనసాగుతోంది. విపక్షాలు సాధారణంగా ముందస్తుగా సమావేశమవుతుంటాయి. ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. నేడో రేపో సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అవుతుందనే ఉత్కంఠతో ప్రధాన పక్షాలు బడ్జెట్ సమావేశాల పట్ల ముందస్తు చర్యలు నివారించినట్లు స్పష్టమవుతోంది.

సై అంటే సై..



ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ అనేక సమస్యలపై బిజూ జనతాదళ్ (బీజేడీ) ప్రభుత్వంపై దాడికి సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సభలో వాగ్యుద్ధ వాతావరణం నెలకొంటుందని అంతా భావిస్తున్నారు. వారం పాటు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసేందుకు విపక్షాలు బీజేపీ, కాంగ్రెస్ సన్నద్ధమవుతున్నాయి.

శాంతిభద్రతల సమస్యే అజెండాగా..

ప్రధాన ప్రతిపక్షం భారతీయ జనతా పార్టీ రైతుల సమస్యలు, లోపించిన శాంతిభద్రతలు అసెంబ్లీలో లేవనెత్తి బీజేడీ సర్కారుని ముట్టడించేందుకు సమాయత్తమవుతోంది. రాష్ట్రంలో దొంగతనాలు, దోపిడి, హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకోవడం నిత్యకృత్యాలుగా తాండవిస్తున్నాయని ఈ పక్షం ఆరోపణ. పారిశ్రామిక విస్తరణ వాస్తవ ముఖచిత్రం సభలో ప్రవేశ పెట్టే విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించింది. పూరీ జగన్నాథ్ శ్రీ మందిరం వారసత్వ ప్రాకార పథకం, ప్రథమ విశ్వ ఒడియా సమ్మేళనం కార్యక్రమాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోందటూ బీజేడీ ధోరణిని సభలో ఎండగట్టేందుకు విపక్ష సభ్యులు సిద్ధంగా ఉన్నట్లు అనుబంధ వర్గాల విశ్వసనీయ సమాచారం.

జోడోయాత్ర సన్నాహాల్లో కాంగ్రెస్..

ఫిబ్రవరి 6 నుంచి రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర పర్యటన ఏర్పాట్లలో కాంగ్రెసు పార్టీ తలమునకలై ఉంది. ఈ నేపథ్యంలో పలువురు కాంగ్రెసు సభ్యులు భువనేశ్వర్‌కు దూరంగా ఉన్నారు. వీరంతా సకాలంలో చేరి సభలో అధికార పక్షానికి నిలదీస్తారని కాంగ్రెస్ శిబిరం సమాచారం.

అర్పణ్ రథం అక్రమాలు..

పూరీ జగన్నాథ ఆలయం శ్రీ మందిరం వారసత్వ ప్రాకారం లోకార్పణ మహోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా మారు మూల ప్రాంతాల నుంచి అర్పణ రథం పర్యటనలో ప్రజల నుంచి పచ్చి బియ్యం, వక్క, శ్రీఫలం, దక్షిణల వసూళ్లలో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ప్రాజెక్టు రూపకల్పనలో నిధుల వినియోగం ఇతరేతర అనుబంధ అంశాల్ని ప్రస్తావించనున్నట్లు కాంగ్రెస్ శాసనసభ నాయకుడు (సీఎల్‌పి) నరసింగ మిశ్రా పేర్కొన్నారు.

మూడంచెల భద్రతా వ్యవస్థ

భువనేశ్వర్: మధ్యంతర బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వివిధ సంస్థలు, రాజకీయ పార్టీలు, పలు వర్గాలు నిరసన సమావేశాలు, సభలు, ప్రదర్శనలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ తరుణంలో భద్రతా వ్యవస్థలో ఎలాంటి వైఫల్యాలు తలెత్తినా సమర్థంగా ఎదుర్కొనేందుకు కమిషనరేట్ పోలీసులు సిద్ధమయ్యారు. అసెంబ్లీ భద్రతా వ్యవస్థను పటిష్టం చేశారు. నలువైపులా 3 అంచెల భద్రతా వలయం ఏర్పాటు చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో ప్రత్యేక పోలీసు క్యాంపు ఏర్పాటు చేశారు. 31 ప్లటూన్ల పోలీసు బలగాలను మోహరించనున్నారు. వీరితో పాటు స్ట్రైకింగ్ ఫోర్స్, ఎస్టీయూ, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అగ్నిమాపకం తదితర విభాగాలు అన్ని కోణాల్లో నిఘా వేస్తాయని తెలిపారు.

సీసీ టీవీ కెమెరాల నిఘా..

స్థానిక శాసనసభ నుంచి దిగువ పీఎంజీ, రవీంద్ర మండప వీధి, పరిసర వీధుల్లో వందలాది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ గేట్, రవీంద్రమండప గేటు, లోయర్ పీఎంజీ తదితర 5 చోట్ల 5 తాత్కాలిక పోలీస్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నారు. నగర డీసీపీతో సహా ఇద్దరు డీసీపీ హోదా అధికారులు, 8 మంది అదనపు డీసీపీలు, 16 మంది డీఎస్పీ హోదా అధికారులు, 20 మంది ఐఐసీలు 100 మందికి పైగా అధికారులకు ప్రత్యేక భద్రతా వ్యవస్థ కార్యకలాపాలు పర్యవేక్షిస్తారు. సమావేశాలు ముగిసే వరకు రాత్రింబవళ్లు సాయుధ భద్రతా బలగాల భద్రత కొనసాగుతుందని స్పష్టం చేశారు.

హోటళ్లలో తనిఖీలు..

మాస్టర్‌క్యాంటీన్, పీఎంజీ రోడ్డును పోలీసులు పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు. రైల్వే స్టేషన్ సమీపంలోని అన్ని హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు చేపడుతున్నారు. నగర శివార్లు ఖండగిరి మొదలుకొని రసూల్‌గఢ్, కల్పన, పటియా తదితర ప్రాంతాల్లో పోలీసులు రాత్రిపూట వాహనాల కదలిక పట్ల నియంత్రణ, తనిఖీలు ప్రారంభించారు.

వాహనాల దారి మళ్లింపు..

బడ్జెట్ సమావేశాలు నేపథ్యంలో శాసన సభ పరిసర రహదారులపై వాహనాల రాకపోకల్ని నియంత్రించారు. ఈ క్రమంలో పలు ఆంక్షలు జారీ చేశారు. హౌసింగ్ బోర్డ్ వీధి వైపు వచ్చే వాహనాలు కేశరి టాకీస్ వైపు వెళ్లకుండా ఎడమ వైపు రోడ్డు మీదుగా దారి మళ్లిస్తున్నారు. ఏజీ ఛక్ వైపు నుంచి పీఎంజీ ఛక్ వైపు వచ్చే వాహనాల్ని జయదేవ్ భవన్ సమీపంలోని ఇందిరా గాంధీ పార్క్ రోడ్‌లో కుడి వైపు నుంచి నడిపిస్తారు. మాస్టర్ క్యాంటీన్ వద్దకు వచ్చే వాహనాలు దిగువ పీఎంజీ కూడలి నుంచి ఎడమ లేదా కుడి వైపు రోడ్డు గుండా దారి మళ్లిస్తారు. స్థానిక రవీంద్ర మండపం గుండా 120 బెటాలియన్ వైపు వెళ్లే వాహనాలు పవర్ హౌస్ వీధి గుండా వెళతాయని తెలిపారు. రాజ్‌భవన్ వీధి మీదుగా ఎమ్మెల్యే కాలనీ, రవీంద్ర మండపం వైపు వెళ్లే వాహనాలను శాస్త్రినగర్ వీధి వైపు మళ్లిస్తారు.

న్యూస్‌రీల్

భార్యపై కత్తితో దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాసంతి

రాయగడ: అనుమానంతో భార్యను భర్త కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం స్థానిక కొంధొ నది వీధిలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంధొనది వీధిలో నివాసముంటున్న భార్యాభర్తలు ప్రదీప్ బెహరా, బాసంతిల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. భార్యకు వివాహేతర సంబంధం ఉందంటూ తరచూ తగాదా పడుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవలు పెరిగాయి. దీంతో కోపోద్రిక్తుడైన ప్రదీప్ ఇంట్లో కూరగాయలు తరిగే పదునైన కత్తిని తీసుకొచ్చి భార్యపై దాడి చేశాడు. కడుపు, చేతిపై గాయాలై రక్తపు మడుగులో ఉన్న బాసంతిని ఇరుగుపొరుగు వారు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ప్రదీప్ పరారయ్యాడు.

వృద్ధుడి దారుణ హత్య



పొలంలో వృద్ధుడి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి మోటామ్‌గూఢ పంచాయతీ పలాగూఢ గ్రామం వద్ద ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాగూఢ గ్రామానికి చెందిన సాలబామ్ దేవ్ (62) శనివారం పొలానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం సాలబామ్ కోడలు కర్రల కోసం అడవికి వెళ్లి తిరిగి వస్తుండగా సొంత పొలంలోనే మామయ్య మృతదేహం కనిపించడంతో భయంతో కేకలు వేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వెంటనే వచ్చి పరిశీలించగా గొంతుకోసి హత్య చేసి ఉండటం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన తండ్రిని చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని సాలబామ్ కుమారుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు.

500 కిలోల గంజాయి సీజ్



గంజాయిని సీజ్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బరంపురం: బరంపురం పోలీసు జిల్లా బీఎన్ పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో 16వ నంబర్ జాతీయ రహదారిలో బైపాస్ రోడ్–బాపూజీ నగర్ 10వ లైన్‌లో ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 290 కిలోల గంజాయిని బరంపురం అబ్కారీ అధికారులు సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. అదే విధంగా ఛత్రపూర్ రైల్వే పోలీసులు 160 కిలోల గంజాయి సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేశారు. అస్కా పోలీసులు మరో 50 కిలోల గంజాయిని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న యువకుడు

బరంపురం: రక్తదానంతో ప్రాణదాతలు కావాలని డాక్టర్ రమేష్ చంద్ర చావ్ పట్నాయక్ అన్నారు. ఆదివారం ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రిలోని రెడ్‌క్రాస్ విభాగంలో జై జగన్నాథ యోగా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీడీఏ చైర్మన్ సుబాష్ మహరణ తదతరులు పాల్గొన్నారు.

వందే ఉత్కళ జనని..



స్థానిక కిస్ విద్యా సంస్థ ప్రాంగణంలోఅద్భుత దృశ్యం చోటుచేసుకుంది. ప్రథమ విశ్వ ఒడియా భాషా సమ్మేళని ప్రారంభోత్సవం సందర్భంగా సుమారు 40 వేల మంది విద్యార్థులు ఒడిశా మ్యాప్ ఆకృతిలో నిల్చున్నారు. వీరంతా సామూహికంగా రాష్ట్ర గీతం వందే ఉత్కళ జనని గీతాలాపన చేశారు. – భువనేశ్వర్

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం



మంత్రిడి రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్ పండా

బరంపురం: రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాలన సాగిస్తున్నారని జిల్లా ప్రణాళికా అధ్యక్షుడు, బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా చెప్పారు. ఆదివారం గోపాల్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని రొంగయిలొండా బ్లాక్ మంత్రిడి గ్రామంలో రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవీన్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తోందన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నాలుగు కోట్ల ఒడిశా ప్రజల నాయకుడిగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బీజేడీ నాయకులు, బ్లాక్ అధ్యక్ష కార్యదర్శులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

డొంగిరియాలో అభివృద్ధి భేష్



డొంగిరియా పిల్లలతో ఎలిజబెత్ బృందం

- వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం డైరెక్టర్ ఎలిజబెత్ ఫవురా

రాయగడ: డొంగిరియా ప్రాంతంలో అభివృద్ధి బాగుందని ప్రపంచ ఆహార ప్రోగ్రాం డైరెక్టర్ ఎలిజబెత్ ఫవురా కితాబునిచ్చారు. జిల్లాలోని నియమగిరి పర్వత ప్రాంతాల్లోని డొంగిరియా గ్రామాల్లో వీరి బృందం రెండు రోజులుగా పర్యటించి ఆదివారం తిరుగుప్రయాణమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుర్లి, కాంబేషు తదితర డొంగిరియా తెగల జీవన విధానం, ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. లకును జకసిక అనే రైతు పండించిన స్ట్రా బెర్రీ వంటి పంటలపై మిగిలిన రైతులకు కూడా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక చిన్నారులతో ముచ్చటించారు. డీకేడీఏ సంస్థ అధికారి మాట్లాడుతూ డొంగిరియాల జాతి విద్యార్థుల్లో ఎంతోమంది ఉన్నత చదువులు చదివి మంచి స్థానాల్లో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రపంచ ఆహార ప్రోగ్రాం ఒడిశా శాఖాధికారి హమాంశు భొయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.9,500 చెల్లించాలి

జయపురం: ఈపీఎఫ్ ఖాతాదారులకు కనీస పెన్షన్ రూ.9,500 చెల్లించాలని కొరాపుట్ జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం జయపురం యాదవ భవనంలో కొరాపుట్ జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ వార్షిక సమావేశం నిర్వహించారు. కార్మిక నేత జుదిష్టర్ రౌళో అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాధారణ కార్యదర్శి ప్రదీప్ మహంతి మాట్లాడుతూ 1995 నుంచి ఈపీఎఫ్ పొందుతున్న వారందరికీ కనీస పెన్షన్ రూ.9,500 చెల్లించాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నళినీరథ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలే శరణ్యమన్నారు. జయపురం సేవాపేపర్ మిల్లు కార్మికుల పీఎఫ్ కోల్‌కతా నుంచి బరంపురం పి.ఎఫ్ కమిషనర్ కార్యాలయానికి ట్రాన్స్‌ఫర్ కావడంతో కార్మికుల తొలి విజయమన్నారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా నళినీరథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉమాకాంత రథ్, ఉపాధ్యక్షులుగా ముదిరథ్, పి.రాంబాబు, సాధారణ కార్యదర్శిగా ప్రదీప్ మహంతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నారాయణదాస్, సహాయ కార్యదర్శిగా ఎం.ఎస్.రావు, కోశాధికారిగా దుర్గాశంకర దాస్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా భువనేశ్వర్ సాహు, పితబాస్ మిశ్రా, వైజయంతి పండ, హరి మిశ్ర, కిశోర్ చంద్ర పండలను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకుడు

అభివృద్ధి పనులపై సమీక్ష

జయపురం: మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కొరాపుట్ జిల్లా కలెక్టర్ బి.కీర్తి వాసన్ ఆదివారం సందర్శించారు. జయపురంలోని విక్రమదేవ్ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ కాంప్లెక్స్, జగన్నాథ సాగర్‌లను పరిశీలించి పనుల ప్రగతిపై సమీక్షించారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచే గది, ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్, ట్రైనీ ఐఏఎస్ సౌమ్య రంజన్ ప్రధాన్, ఇంజినీర్ క్షీరధర్ ఖందపాణి, సమగ్ర గిరిజనాభివృద్ధి ఏజెన్సీ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రణయ రంజన్ బెహరా, జయపురం సబ్‌కలెక్టర్ ప్రభాత్ కుమార్ పొరిడ, మున్సిపల్ సీఈఓ సిద్ధార్థ పటానాయక్, జూనియర్ ఇంజినీర్ అజయ జానీ పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

చిరుతపులి కళేబరం లభ్యం



జీడి తోటలో లభించిన చిరుత పులి కళేబరం

భువనేశ్వర్: అంగుల్ జిల్లా అఠొమల్లిక్ అటవీ రేంజ్ సన్నొహులా పంచాయతీ మిండులో గ్రామ పరిధిలోని జీడి తోటలో స్థానికులు పెద్ద చిరుతపులి కళేబరాన్ని గుర్తించారు. ఆదివారం తెల్లవారుజామున వంట చెరకు కోసం అడవిలోకి వెళ్లిన మహిళకు ఈ కళేబరం కనిపించడంతో గ్రామస్తులకు తెలియజేసింది. సుమారు వారం కిందట పులి మరణించినట్లు భావిస్తున్నారు. సమాచారం అందడంతో అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలాన్ని సందర్శించారు. చిరుత మృతిపై విచారణ చేపట్టారు. శవపరీక్ష తర్వాతే అసలు కారణం తెలుస్తుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. కాగా, అంగుల్ జిల్లా అటవీ ప్రాంతాల్లో పులుల అనుమానాస్పద మరణాలు తరచూచోటు చేసుకుంటున్నాయి. గత ఏడాది నవంబర్ 6న కిషోర్‌నగర్ మండలం పులొజొడి అటవీ ప్రాంతంలో చిరుతపులి కళేబరం స్వాధీన పరచుకున్నారు. 2021 డిసెంబర్ 18న హండపా అటవీ రేంజ్ పరిధిలోని బాత్రఖోల్ అటవీ ప్రాంతంలోని వరి పొలంలో మరో చిరుతపులి కళేబరం గుర్తించారు. గత ఏడాది జనవరి తొలి వారంలో సతొకొసియా అభయారణ్యం కులంగ గ్రామం పరిసరాల్లో చిరుత పులి తల్లి, కూనల మృతదేహాలు బయటపడిన విషయం తెలిసిందే.

మైసూరుకు గిరిజన యువత

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ఎం.వి–3 గ్రామంలో బీఎస్ఎఫ్ క్వార్టర్స్ వద్ద ఆదివారం మైసూరు పర్యటన కోసం గిరిజన యువతను ఎంపిక చేశారు. కమాండర్ శివ ఓమ్ ఆధ్వర్యంలో దళపతిగూడ, పూజారిగూడ, సూవగూడ, టేముర్‌పల్లి, తులాసి పాహడ్, లూలేరు, ముండగూడ, సలీమ్, కన్రగూడ గ్రామాలకు చెందిన 20 మంది యువతీ యువకులను ఎంపిక చేశారు. వీరంతా ఈ నెల 6 నుంచి 12 వరకు మైసూరులో పర్యటించి చారిత్రక ప్రదేశాలను తిలకిస్తారని కమాండర్ తెలిపారు. ఇందుకయ్యే ఖర్చును తామే భరిస్తామని చెప్పారు. గిరిజన యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకే పర్యటనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



గిరిజన యువతతో బీఎస్ఎఫ్ అధికారులు

క్లుప్తంగా

జయపురంలో సినీ నటుల సందడి



అనుష్క, రమ్యకృష్ణ

జయపురం: ప్రముఖ సినీ నటులు అనుష్క శెట్టి, రమ్యకృష్ణ జయపురంలో సందడి చేశారు. ఓ సినిమా షూటింగ్ కోసం విచ్చేసిన వీరు బాలకృష్ణ పేలస్ హోటల్లో విడిది చేశారు. ప్రకృతి అందాలకు నిలయమైన కొరాపుట్ జిల్లాలో పలు ప్రాంతాల్లో ఈ నెల 14 వరకు సినిమా షూటింగ్ జరగనుందని పేలస్ యజమాని సందీప్ సామంతరాయ్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం జగదల్‌పూర్ జిల్లాలోని సుప్రసిద్ధ చిత్రకూట్ జలపాతం, తీర్థఘడ్ ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతున్నట్లు సమాచారం.

పర్లాకిమిడిలో విద్యుత్ కోతలు

పర్లాకిమిడి: గత నాలుగు రోజులుగా పర్లాకిమిడి పట్టణంలో విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. గతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే ముందుగానే ప్రజల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపేవారు. ప్రస్తుతం అవేమీ లేకుండా పవర్ కట్‌లు విధిస్తుండటంతో వస్త్రాలు, టైలరింగ్, ఆన్‌లైన్ పనులు చేస్తున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అసిస్టెంట్ ఇంజినీర్ వద్ద ప్రస్తావించగా.. రాజావీధిలో కొత్త లైన్లు మార్పిడి చేస్తున్నందున విద్యుత్ కోతలు విధించాల్సి వస్తోందని చెప్పారు. కాగా, టాటా పవర్ (టి.పి.ఎస్.ఓ.డి.ఎల్)కు ప్రభుత్వం విద్యుత్ సరఫరా బాధ్యతలు ఇచ్చిన తరువాత విద్యుత్ కోతలు విధించటంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

'కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి'



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎంఆర్ జ్యోతి ఫెడరిక్ అధ్యక్షతన ఆదివారం కళాశాల సెమినార్ హాల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు, జ్యోతి ఫెడరిక్ తదితరులు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు దాతలు సహకరించాలని కోరారు. ఇక్కడ చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారు బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

సెల్‌ఫోన్ కొనలేదని ఆత్మహత్య

రణస్థలం: సెల్‌ఫోన్ కొనలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నెలరోజులు చావుతో పోరాటం చేసి కన్నుమూశాడు. మండలంలోని వీఎన్ పురం పంచాయతీలో గల సూరాపురం గ్రామానికి చెందిన గురివిల్లి భాస్కరరావు(18) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భాస్కరరావు సెల్‌ఫోన్ కావాలని ఇంటిలో అల్లరి చేసేవాడు. కొనలేదనే కోపంతో గత నెల 15న గడ్డిమందు తాగేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు రణస్థలం సీహెచ్‌సీలో చేర్పించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి భాస్కరరావు మృతి చెందాడు. టచ్ ఫోన్ కొనలేదనే కారణంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని తండ్రి నీ లయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 89వ నెలవారీ సాహితీ సమ్మేళనం చక్కగా ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో 14మంది కవులు సామాజిక పరమైన కవితలు చదివారు. ముందుగా తెరవే కార్యద ర్శి రమణమూర్తి తండ్రి విశ్రాంత ఉపాధ్యా యులు తవిటన్న పట్నాయక్ మృతికి నివాళులు అర్పించారు. కవి సమ్మేళనంలో కవులు బి.కోమలరావు, నిక్కు హరిసత్యనారాయణ, చాడ శ్రీనివాస్, తంగి ఎర్రమ్మ, రెడ్డి లలిత, బి.జగన్నాథరావు, తోట గోపాలరావు, ఐఎన్‌డీ ప్రసాదరావు, మంగిపూడి శ్రీనివాసరావు, పీవీ దుర్గాప్రసాద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అపురూపం.. ఒడిస్సీ నృత్యరూపకం



నృత్య రూపకంలో యుద్ధ విన్యాసాలు



ఉత్కళ రాష్ట్రం ఆవిర్భావం నృత్య రూపకం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రథమ విశ్వ ఒడియా భాషా సమ్మేళని ఉత్సాహంగా సాగుతోంది. భాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయం, ఆచార వ్యవహారాల పుట్టుపూర్వోత్తరాల్ని అత్యంత రసవత్తరంగా ప్రదర్శిస్తున్నారు. పగటి పూట భాషా సంబంధిత చర్చలు, ప్రసంగాలు, సభలు నిర్వహిస్తుండగా.. సంధ్య వేళలో రాష్ట్ర కళలు, నృత్య, అభినయ సంప్రదాయాల ప్రదర్శనలతో దేశ, విదేశాల నుంచి విచ్చేసిన ఒడియా భాషా ప్రియులు, భాషావేత్తలు, పరిశోధకుల్ని మంత్రముగ్ధం చేస్తున్నారు. ఒడిస్సీ నృత్య గురువు అరుణా మహంతి ఆధ్వర్యంలో రూపొందించిన 'జాతి నందిఘోష్ – ఒక పరివర్తన' ఒడిస్సీ నృత్య రూపకం ఔరా అనిపించింది. 160 మంది యువ నృత్యకారులు కళింగ యుద్ధం, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం, ఆధునిక ఒడిశా పరివర్తన సన్నివేశాల్ని అద్భుతంగా ప్రదర్శించారు.


– భువనేశ్వర్



ఒడియా వర్ణమాల ఆవిర్భావంతో జగన్నాథ చైతన్య ప్రదర్శన



అదరహో అనిపించిన విన్యాసాలు



ఆకట్టుకున్న ప్రదర్శన



వందే ఉత్కళ జనని

మధుసూదన్‌దాస్ స్ఫూర్తిప్రదాత



రాయగడ: మధుసూదన్‌దాస్ విగ్రహానికి నివాళులు అర్పించిన దృశ్యం



భువనేశ్వర్: విశ్వ ఒడియా భాషా సమ్మేళనంలో మధుసూదన్ దాస్‌కు నివాళులు



బరంపురం: గాంధీనగర్ జంక్షన్‌లో మధుసూదన్ దాస్ విగ్రహానికి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల నివాళి



బరంపురం: మధుసూదన్‌దాస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు



జయపురం: మధుసూదన్‌దాస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కేదార్‌నాథ్ బెహరా

రాయగడ: ఒడిశా వరపుత్రుడు ఉత్కళగౌరవ్ మధుసూదన్ దాస్‌ను యువతరం ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మధుసూదన్‌దాస్ 90వ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాయగడలోని యూజీఎంఐటీ సంస్థ ప్రాంగణంలోని మధుసూదన్‌దాస్ విగ్రహానికి ప్రిన్సిపాల్ నారాయణ పటేల్, జిల్లా పారిశ్రామిక కేంద్రం పీఓ సవ్యసాచి సాహు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

☛ భువనేశ్వర్: ప్రథమ విశ్వ ఒడియా భాషా సమ్మేళనంలో మహనీయుడు ఉత్కళ గౌరవ్ మధుసూదన్ దాస్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ప్రత్యేక ఉత్కళ ప్రావిన్స్ ఏర్పాటుకు, ఒడియా భాషా ఉద్యమానికి మధుసూదన్‌దాస్ సారథ్యం వహించారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో



జయపురం: రాధాకృష్ణ విశ్వాసరాయ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సభ్యులు

ఒరియా భాష, సాహిత్యం, సాంస్కృతిక శాఖ మంత్రి అశ్విని కుమార్ పాత్రో, వాణిజ్య, రవాణా శాఖ మంత్రి టుకుని సాహు, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తదితరులు పాల్గొన్నారు.

☛ బరంపురం: నేటితరం మధుసూదన్‌దాస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని గంజాం బార్ అధ్యక్షుడు కపిలేశ్వర్ పట్నాయక్ అన్నారు. గంజాం బార్ న్యాయవాదుల సంఘం, గంజాం జిల్లా వికాష్ మంచ్ ఆధ్వర్యంలో గాంధీనగర్ మెయిన్ రోడ్‌లో మధుసూదన్ దాస్ వర్ధంతి నిర్వహించారు. మధుసూదన్‌దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

☛ జయపురం: ఉత్కళ గౌరవ మధుసూదనదాస్, కొరాపుట్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు రాధాకృష్ణ విశ్వాసరాయ్ వర్ధంతి జయపురంలో నిర్వహించారు. పలు సంస్థలు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పూజ్య పూజా సంసద్ అధ్యక్షుడు కేదారనాథ్ బెహరా, కార్యదర్శి తపన కుమార్ త్రిపాఠి, కోశాధికారి బైరాగి సాహు, జయపురం ఆకాశవాణి విశ్రాంత అధికారి ఉదయనాథ్ జాని తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో చోరీ

జయపురం: స్థానిక మహారాణిపేటలోని కళింగ వైశ్యుల ఆరాధ్య దైవం కన్యాకా పరమేశ్వరి ఆలయంలో శనివారం రాత్రి దొంగతనం జరిగినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి సాన వెంకటరమణ, అధ్యక్షుడు వారణాశి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం జయపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయ పూజారి శ్రీరంగం సూర్యనారాయణ శర్మ ఆదివారం ఉదయం 7.30 గంటలకు ఆలయానికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండటం గుర్తించి వెంటనే కమిటీ సభ్యులకు తెలియజేశారు. లోపలకు వెళ్లి చూడగా ఆలయ ఆఫీసు తలుపుల తాళాలు బద్దలు కొట్టి అందులో ఉన్న రూ.21,244 నగదు, 14 గ్రాముల బంగారం, 312 గ్రాముల వెండి, 350 గ్రాముల వెండి పూజా సామగ్రి, ఆలయ ప్రధాన మందిరంలో దాదాపు 2 కేజీల వెండి మకరతోరణం, 200 గ్రాముల వెండి మకుటం, 6 గ్రాముల రెండు బంగారు మంగళసూత్రాలు, 300 గ్రాముల వెండి పాదాలు, సీసీ టీవీ పట్టుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు రూ.4 లక్షల విలువైన సామగ్రి చోరీ జరిగిందన్నారు.



కన్యకా పరమేశ్వరి ఆలయం



తలుపుల వద్ద పడి ఉన్న తాళాలు

టైలరింగ్‌తో స్వయం ఉపాధి



శిక్షణ పొందిన మహిళలతో నిర్వాహకులు, అధికారులు

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ వద్ద యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో మహిళలకు టైలరింగ్‌లో 30 రోజుల పాటు శిక్షణ అందించారు. ఆదివారంతో శిక్షణ పూర్తయిన సందర్భంగా జిల్లా ముఖ్య ఉపాధి అధికారి సౌభాగ్య స్మృతి రంజన్ త్రిపాఠి, యూనియన్ బ్యాంకు డైరెక్టర్ శ్రావణ్ కుమార్ ప్రధాన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జిల్లాలోని పలు మండలాల నుంచి విచ్చేసిన 35 మంది మహిళలు శిక్షణ పొందారు. కార్యక్రమంలో ప్రదీప్ కుమార్ దాస్, మహిళా కుట్టు శిక్షకురాలు ఎ.బాలమాణి ఆచారి, కోఆర్డినేటరు దిలీప్ కుమార్ తంతి తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా ముఖ్య ఉపాధి అధికారి సౌభాగ్య స్మృతి రంజన్ త్రిపాఠి

భార్యకు బాధ్యతలు అప్పగించిన భర్త

భువనేశ్వర్, కటక్ జంట నగరాల పోలీస్ కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సంజీబ్ పండా.. అతని భార్య, 1995 బ్యాచ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ సంతోష్ బాలాకు ఒడిశా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర హోం శాఖ ఇటీవల ఐపీఎస్ స్థాయిలో అధికారుల్ని బదిలీ చేసిన నేపథ్యంలో యాదృచ్ఛికంగా ఈ అప్పగింత చోటు చేసుకుంది.

– భువనేశ్వర్



నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియను సోమవారం ఉదయం 8 గంటల నుంచి అనివేటి మండపంలో నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు గ్రామపెద్దలు, ఆలయ పాలకమండలి సభ్యులు, పలు కీలక ప్రభుత్వ శాఖాధికారుల సమక్షంలో హుండీలను తెరిపించి నిబంధనల ప్రకారం లెక్కింపును చేపడతామని వివరించారు. రథసప్తమి పర్వదినానికి ముందు హుండీ లెక్కింపు చేపట్టడంతో మొక్కుల చెల్లింపులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని ఈఓ తెలిపారు.

అరసవల్లిలో భక్తుల సందడి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని పుష్యమాస ఆదివారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక, విశిష్ట దర్శనాల మార్గాలతో పాటు ఉచిత దర్శన మార్గాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇక అంతరాలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఉచిత మంచినీరు, ఉచిత వైద్య సదుపాయాలతో పాటు ఉచిత ప్రసాదాలను కూడా ఆలయ సిబ్బంది పంపిణీ చేశారు. పలువురు జిల్లా స్థాయి అధికారులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.90,500, విరాళాల ద్వారా రూ.71,954, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లుగా ఈఓ తెలియజేశారు.

నేడు జీడి, మామిడి తోటలకు వేలం

రణస్థలం: శ్రీకాకుళం రేంజ్‌లో పొందూరు, తండ్యాం, లోలుగు, కొత్తకుంకాం, ఎందువ, జీరుకొవ్వాడ, బారువ, కొవ్వాడ మత్స్యలేశం, లక్ష్మీపురం, తామడ, లావేరు గ్రామాల్లోని అటవీ జీడి, మామిడి తోటలకు సోమవారం వేలంపాట నిర్వహించనున్నారు. అటవీ శాఖ జీడి, మామిడి తోటల ఫలసాయం సేకరించి తీసుకుపోవటం గురించి విశాఖపట్నం ముఖ్య అటవీ సంరక్షణాధికారి ఆదేశాల ప్రకారం వేలం పాట వేస్తున్నామని కందివలస సెక్షార్ అటవీశాఖ సెక్షన్ అధికారి తలే శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 5వ తేదిన జిల్లా అటవీశాఖ కార్యాలయంలో బహిరంగ వేలం ఉంటుందని, అమ్ముడు కాని తోటలు ఈ నెల 14న, 24న మరోసారి వేలం వేస్తారని చెప్పారు. గుత్తేకాలం మార్చి 1వ తేదీ నుంచి జూన్ 30 వరకు అమలులో ఉంటుందని తెలిపారు. పాటదారుడు ధరావత్తు రూ.5వేలు నగదు తోపాటు అదనంగా రూ.25వేలు చెల్లించాలని తెలిపారు. పాట ఖరారైన వ్యక్తి పాన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు.

పోర్టు పనుల పరిశీలన

సంతబొమ్మాళి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నౌపడలో పునరావాస కాలనీలను కలెక్టర్ మనజీర్ జిలా నీ సమూన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్‌కుమార్ కలసి ఆదివారం పరిశీలించారు. ఇటీవల బాధ్య తలు స్వీకరించిన కలెక్టర్ మూలపేటలో పర్యటించి పోర్టులో జరుగుతున్న పనులను పోర్టు మేనేజర్ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. నార్త్ బ్రేక్, సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం పనులను సముద్రంలోకి వెళ్లి పరిశీలించారు. తీరంలో చేపడుతున్న సివిల్ వర్క్, పోర్టు అప్రోచ్ రోడ్డు, పోర్టు డిజైనింగ్ మ్యాప్ సహాయంతో పరిశీలించారు. అనంతరం నౌపడలో పునరావా స కాలనీ పరిశీలించారు. ప్లాట్లు గుర్తించి నిర్వాసితులకు అందజేసేందుకు త్వరితగతిన కాలనీ సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డిటి ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ మౌళి, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.



బ్రేక్ వాటర్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

క్లుప్తంగా

అలరించిన సినీ సంగీత విభావరి



ఘంటసాల ఆపాత మధురాలను ఆలపిస్తున్న గాయనీగాయకులు

విజయనగరం టౌన్: ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సినీసంగీత విభావరి ఆద్యంతం ఆహూతులను అలరించింది. కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు సారథ్యంలో సాయి, పవన్‌ల సంగీత నిర్వహణలో ఘంటసాల ఆపాత మధురాలను గాయనీ,గాయకులు అద్భుతంగా ఆలపించారు. కార్యక్రమంలో కళాపీఠం ప్రతినిధులు ధవళ సర్వేశ్వర రావు, గ్రంధి విష్ణుమూర్తి, వైవీవీ.సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవాలి

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో గల అన్ని దుకాణాలు, సంస్థలు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోవాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో కోరారు. ఏపీ కార్మిక కమిషనర్, విజయవాడ ఆదేశాల మేరకు దుకాణాలు, సంస్థల చట్టం-1988 సెక్షన్ 3 ప్రకారం రిజిస్ట్రేషన్, సెక్షన్ 4 ప్రకారం రెన్యువల్‌ను ఈనెల 29లోగా విధిగా చేయించుకోవాలని స్పష్టం చేశారు. అలా చేయకపోతే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

పొలిటికల్ సైన్స్ బోధకులకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్ సెబ్జక్టును గెస్ట్ ఫ్యాకల్టీ విధానంలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈమేరకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తులను తమ కళాశాలకు అందజేయాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈనెల 9వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించే డెమో తరగతులకు హాజరు కావాలని, పీహెచ్‌డీ నెట్/సెట్ గల వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించేంతవరకు నిరసన

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగిస్తామని మిమ్స్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టీవీ రమణ స్పష్టం చేశారు. ఈ మేరకు మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరసన కార్యక్రమం ఆదివారం 4వ రోజు కొనసాగింది. మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన శిబిరం నుంచి మూడు లాంతర్ల వరకు ర్యాలీ చేపట్టి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఎం.నారాయణ రావు, వి.అప్పలనాయుడు, కె.కాము నాయుడు, టి.రామకృష్ణ, ఎం.నాగభూషణం, కె. నాగేశ్వరరావు, జి.వరలక్ష్మి, వి.భవాని, బి.బంగారు నాయుడు, మిమ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో హిందీ పరీక్షలు

రాజాం: దక్షిణభారత హిందీ ప్రచారసభ పరీక్షలు ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్నాయని హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు తెలిపారు. ఈ నెల 10న ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు ఉంటాయని, 11న పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. ఈ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు వచ్చాయని, హిందీ ప్రచారక్‌ల నుంచి వాటిని తీసుకోవాలని కోరారు. మిగిలిన వివరాలకు ఫోన్ 99499 17365 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శతాధిక వృద్ధురాలికి పుట్టిన రోజు వేడుక



కుటుంబ సభ్యుల మధ్య పుట్టినరోజు జరుపుకుంటున్న నారాయణమ్మ

శృంగవరపుకోట: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలికి కుటుంబసభ్యులు ఆదివారం సన్మానం చేశారు. గ్రామానికి చెందిన బొజ్జ నారాయణమ్మ 100వ పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సభ్యులు సుమారు 50 మంది ఆమె పుట్టినరోజు వేడకను ఘనంగా నిర్వహించారు.

కనికరమాత కరుణ కోసం..!

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ముగిసిన నవదిన ప్రార్థనలు
- కోలాహలంగా సాగిన యాత్ర



శిలువపై వున్న ఏసుక్రీస్తు వద్ద దీపాలను వెలిగిస్తున్న భక్తులు



కొండదాబాలు కొండపైన విశాఖ అతిమేత్రాణులు మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనలు



మేరీమాతను పూలతో అలంకరించి ప్రత్యేక పల్లకీలో ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని కొండడాబాలు వద్ద ఉన్న వ్యాకులమాత యాత్ర మహోత్సవం ఆదివారం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ ఆలయానికి 133 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉంది. ఏటా ఫిబ్రవరి మొదటి ఆదివారం నిర్వహించే ఈ యాత్రకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు ఒడిశా, కేరళ, కర్ణాటక, తమిళ నాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ చర్చిలో 1914వ సంవత్సరంలో ఫారిస్ నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించిన వ్యాకులమాత ప్రతిమను కులమతాలకు అతీతంగా ఆరాధించడం ఇక్కడి ప్రత్యేకత.

ముగిసిన నవదిన ప్రార్థనలు

ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రకృతి సోయగాల నడుమ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కొండపై గడిచిన తొమ్మిది రోజులుగా ఫాదర్ గొంగాడ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు శనివారం రాత్రి ముగిశాయి. అనంతరం కనికర మాతను ప్రత్యేక పల్లకిలో ఉంచి క్రైస్తవ సోదరులు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. విశాఖపట్నంలోని జ్ఞానాపురం అతిమేత్రాణులు డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో పలువురు విచారణకర్తలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పటిష్టమైన బందోబస్తు

యాత్రకు వేలాదిమంది తరలి రావడంతో పర్యవేక్షణలో ఎటువంటి లవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఐదుగురు సీఐలు, 18 మంది ఎస్సైలు, 235 బంది సిబ్బదితో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల రాక పోకలకు గాను సింహాచలం, మద్దిలపాలెం ఆర్‌టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నిర్వహించారు.మొత్తంగా యాత్ర ప్రశాంతంగా ముగిసింది.

11న వెటరన్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు పోటీలు

- ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపిక
- ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాజు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న జిల్లా స్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం విజయనగరం జిల్లా కేంద్రంలో గల జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ 35 సంవత్సరాల నుంచి 75 సంవత్సరాల మధ్య వయస్సు గల స్త్రీ, పురుషులకు ఈనెల 11న జిల్లా స్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 9 కేటగిరీల్లో నిర్వహించే ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 16 నుంచి రాజమండ్రి వేదికగా జరగబోయే రాష్ట్రస్థాయి వెటరన్స్ బ్యాడ్మింటన్ చాపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు విజయనగరం -నున్న సురేష్, ఫోన్ 9440585553, ఎస్.కోట-పి.శ్రీరాములు, 7989199534, బొబ్బిలి-అపర్ణ బాబా, 7981111705, సాలూరు-సూర్య బహదూర్ థాపా, 9494594356, కొత్తవలస-వై.గణేష్, 9030185690, చీపురుపల్లి-పీసీ.స్వరూప్, 9885830520 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎంకేబీ.శ్రీను, ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్, సహాయ కార్యదర్శి నున్న సురేష్, మీడియా ఇన్‌చార్జి ఎస్.మల్లికార్జునరావు, కోశాధికారి ఎం.అశోక్ కుమార్, కార్యవర్గ సభ్యులు అపర్ణ బాబా, వీడీ గిరి, సూర్య బహదూర్ థాపా, ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే నూతన డైరీ24 ఆవిష్కరణ



ఏపీయూడబ్ల్యూజే నూతన డైరీ-24ను ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

- జర్నలిస్టుల సమస్యలపై మంత్రి బొత్స సానుకూల స్పందన

విజయనగరం అర్బన్: జర్నలిస్టుల సమస్యలపై మంత్రి బొత్స సత్యనారాయణ సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ఆదివారం ఆయనను జర్నలిస్టు సంఘాల నాయకులు కలిసి జర్నలిస్టుల సమస్యలను వివరించారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన వెబ్‌సైట్‌ను మరోసారి తెరవాలని కోరారు. దీనికి మంత్రి బొత్స స్పందిస్తూ అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టులకు సంబంధించిన వినతులను పెడతానని హామీ ఇచ్చారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కమిటీ రూపొందించిన డైరీ-2024ను మంత్రి బొత్స సత్యనారాయణ ఆవిష్కరించారు. ఆయనను కలిసిన వారిలో జర్నలిస్టు సంఘం రాష్ట్రకార్యవర్గసభ్యుడు వీవీశివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు, సీనియర్ జర్నలిస్టులు ఎలిశెట్టి సురేష్‌కుమార్, రాధాకృష్ణ, వైఎస్‌పంతులు, వేదుల సత్యనారాయణ, భరద్వజ చక్రవర్తి ఉన్నారు.

పరీక్షల భయం పోగొట్టేందుకు కౌన్సెలింగ్ కీలకం

విజయనగరం అర్బన్: పరీక్షలపై భయం పోగొట్టేందుకు విద్యార్థులకు మనోవైజ్ఞానిక కౌన్సెలింగ్ అవసరమని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో వచ్చే ఒత్తిడిని అధిగమించేందుకు సైకాలజిస్ట్ డాక్టర్ ఏవీరాజశేఖర్ రచించిన మనోవైజ్ఞానిక కౌన్సెలింగ్ మెటీరియల్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. మొదటి మెటీరియల్‌ను డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ నల్ల తిరుపతినాయుడుకి అందజేశారు. పదిపరీక్షల్లో శతశాతం మార్కులు సాధించగల సామర్థ్యాన్ని విద్యార్థులకు అందించే సూచనలను ఈ మెటీరియల్‌లో పొందుపరిచానని ఈ సందర్భంగా రచయిత రాజశేఖర్ తెలిపారు.



మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

టార్గెట్ శతశాతం



బూశాయవలస కేజీబీవీలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న టీచర్

- కేజీబీవీల్లో 'పంచతంత్ర' ప్రణాళిక
- ఉత్తమఫలితాలకు నగదు పురస్కారాలు
- సబ్జెక్టుల వారీగా మెరుగైన శిక్షణ

రామభద్రపురం: కేజీబీవీల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థినులు ఉత్తమఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో పంచతంత్ర ప్రణాళికను ప్రభుత్వం రూపొందించింది.ఈ సారి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు రూ.5 వేలు, నూరు శాతం ఫలితాలు సాధించిన విద్యాలయాలకు రూ.50 వేల నగదు బహుమతి అందించేందుకు సమగ్రశిక్ష ఉన్న ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో 26 కేజీబీవీలు ఉండగా వాటిలో గతేడాది పదో తరగతిలో 1036 మందికి గాను 783 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 670 మందికి 331 మంది, రెండో సంవత్సరంలో 764 మందికి 457 మంది ఉత్తీర్ణులయ్యారు. అయితే ఈ ఏడాది పదో తరగతిలో 1023 మంది, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 820, రెండో సంవత్సరం 670 మంది విద్యార్థినులు చదువుతున్నారు. గతేడాది ఫలితాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ ఏడాది నూటికి నూరుశాతం ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికలు తయారుచేశారు. దీనిలో బాగంగా ప్రతి టీచర్‌కు ఆరు నుంచి ఏడుగురు విద్యార్థినులను అడాప్ట్ చేసి వ్యక్తిగత పర్యవేక్షణ తో పాటు మెరుగైన విద్యాబోధన చేసేలా ఎస్ఎస్ఏ చర్యలు తీసుకుంది. ఉపాధ్యాయుల కొరత ఉన్న విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీని నియమించింది. ప్రతి సబ్జెక్టు రివిజన్ చేయడంతో పాటు అత్యంత ప్రాముఖ్యమైన ప్రశ్నలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. శిక్షణలో విద్యార్థుల ప్రతిభపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలపై భయాన్ని పోగొడుతున్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా టైమ్‌టేబుల్ రూపొందించి మరీ సబ్జెక్టుల వారీగా ఉదయం, మధ్యాహ్నం మెరుగైన బోధన, శిక్షణ అందిస్తున్నారు. విద్యాయాల్లో ప్రిన్సిపాల్స్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించగా డీఈవోలు, ప్రాజెక్టు కో ఆర్డినేటర్లు, జీసీడీవోలు, ఎంఈవోలు తదితర ఉన్నతాధికారులు పర్యవేక్షణ ముమ్మరం చేశారు.



స్టడీ అవర్‌లో శ్రద్ధగా చదువుతున్న ఇంటర్‌మీడిమట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు

ఉత్తమ ఫలితాలకు పురస్కారం



ఈ ఏడాది నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేందుకు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాం. అన్ని సబ్జెక్టులను కవర్ చేస్తూ రోజువారీ స్టడీ ప్రణాళిక, టైమ్‌టేబుల్ ఇచ్చాం. వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈసారి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు, విద్యాలయాలకు ప్రభుత్వం పురస్కారాలు ఇస్తుంది.

బి.లింగేశ్వర రెడ్డి, ఎస్ఎస్ఏ జిల్లా కో ఆర్డినేటర్ విజయనగరం

మన్యంలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు



స్కై సైక్లింగ్ చేస్తున్న పర్యాటకులు



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న పర్యాటకులు

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట మన్యంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. మెట్టుగూడ జలపాతంతో పాటు పలు పర్యాటక ప్రదేశాలు సందర్శించారు. అలాగే స్థానిక జల విహార్‌లో బోటుషికారుతో పాటు అడ్వెంచర్ పార్కులో పలు సాహస క్రీడల్లో పాల్గొన్నారు. షూటింగ్, బంజీట్రంపోలిన్, క్లైంబింగ్, హ్యాంగింగ్ బ్రిడ్జి వంటివాటిపై నడిచి ఆనందించారు.

బెధర గొడుతున్న నాటుకోడి

- బాగా పెరిగన ధర
- కిలో రూ.800 పైబడి అమ్మకాలు
- గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల లభ్యం
- కిలో కోడి ధర రూ.600 పైబడి
- గుడ్డు ధర కూడా అంతే



ఓ గ్రామంలో పెంపకందారు వద్ద నాటుకోళ్లు

రాజాం: సాధారణంగా దసరా, సంక్రాంతి పండగకు నాటు కోడి ధర పెరుగుతుంటుంది. ఈ ఏడాది సంక్రాంతికి నెల రోజులు ముందునుంచే దాని ధర పెరుగుతూ వస్తుంది. నాటు కోడికి ప్రస్తుతం బాగా డిమాండ్ ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో వాటి పెంపకం అధికమైంది.

కరోనా లాక్ డౌన్ నుంచి..

కరోనా లాక్‌డౌన్ ఏర్పడిన నాటి నుంచి నాటుకోడి మాంసం, గుడ్లుపై ప్రజలు దృష్టిసారించారు. వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటే కరోనా రాదని నిపుణులు తెలియజేయడంతో పాటు మాంసం, గుడ్లు, చేపలు తీసుకోవాలని సూచించారు. దీంతో ప్రజలంతా నాటుకోడి మాంసం, గుడ్లు, గొర్రె మాంసంపై పడ్డారు. గొర్రె మాంసం గతంలో కిలో రూ. 700లు ఉండగా ఇప్పుడు రూ.900 నుంచి రూ.1000 మధ్య పలుకుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి చోట వారానికి ఒకరోజు గొర్రె మాంసం విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఇదే కోవలో నాటుకోడికి కూడా డిమాండ్ పెరిగింది. గతంలో కిలో మాంసం పడే నాటు కోడి ధర రూ.500 ఉండేది. ఇప్పుడు ఆ ధర రూ.600కు చేరింది. చికెన్‌సెంటర్ల వద్ద నాటు కోడి మాంసం రూ. 800కు విక్రయిస్తున్నారు. నాటు కోడి గుడ్లకు కూడా మంచి డిమాండ్ ఉంది. నాటు కోడి గుడ్లు ఇప్పుడు ఎక్కడా సాధారణంగా లభించడం లేదు. ఒక గుడ్డు ధర రూ.10 పలుకుతుంది. దీంతో గ్రామాల్లో నాటుకోళ్ల పెంచేవారి సంఖ్య పెరిగింది. నాటుకోళ్లు కూడా నాలుగు నుంచి ఆరు నెలల వ్యవధిలో పెరుగుదలకు వచ్చి విక్రయాలకు అనువుగా మారుతుంటాయి. నాటుకోడి పెంచడం ద్వారా పల్లె ప్రాంతాల్లో ఆదాయ వనరులు పుష్కలంగా కొంతమంది రైతులకు కలిసివస్తున్నాయి.

కల్తీ మాంసం విక్రయాలు

పట్టణ ప్రాంతాల్లో పలు చికెన్ సెంటర్ల వద్ద బ్రాయిలర్‌తో పాటు నాటుకోడి మాంసం విక్రయాల బోర్డులు దర్శనమిస్తున్నాయి. కిలో నాటుకోడి మాంసం రూ. 600 నుంచి రూ. 800లకు విక్రయిస్తున్నాయి. ఈ మాంసంలో బ్రాయిలర్ కోడి మాంసం కలిపేయడం, మరికొన్ని చోట్ల క్రాస్ నాటుకోడి మాంసం కలిపేయడం చేస్తున్నారు. దీంతో నాటుకోడి మాంసం కల్తీకి కూడా గురవుతోంది. ఆ కల్తీ బారి నుంచి తప్పించుకునేందుకు నాటుకోడి మాంసం కావాలనుకునేవారు ఇప్పుడు పల్లెబాట పడుతున్నారు. అక్కడ కోళ్ల కొనుగోలు చేస్తున్నారు.

పెరటికోళ్ల గుడ్లతో ఉపాధి

నాటుకోడి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పెరటికోళ్ల పెంపకానికి మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో జిల్లాలో 25 వేల మందికి పెరటికోళ్ల యూనిట్లు పంపిణీచేసింది. ఈ యూనిట్‌లో ఎనిమిది పెట్టలతో పాటు రెండు పుంజులు ఉంటాయి. ఈ కోళ్లు ఆరు నెలల పాటు గుడ్లు పెడుతూనే ఉంటాయి. వాటిని విక్రయిస్తున్న మహిళలకు ఆర్థిక చేయూత కూడా లభిస్తోంది.

పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు



పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మ దర్శనానికి అనువైన రోజు కావడంతో పాటు, సెలవు దినం కావడంతో తెల్లవారుజాము నుంచి శంబర గ్రామానికి భక్తులు తరలివచ్చారు. చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. గోముఖి ఆవలి ఒడ్డున ఉన్న వనంగుడిలోని పోలమాంబ మేనత్త పెదపోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకొని, వేప చెట్టుకు పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈఓ వి.వి.సూర్యనారాయణ, దేవదాయ శాఖ సిబ్బంది మురళి తదితరులు చర్యలు చేపట్టారు.

బాసంగి పరిసరాల్లో గజరాజులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి, గదబవలస, వెంకటరాజపురం పరిసర ప్రాంతాలలో ఆదివారం సాయంత్రం గజరాజులు సంచరిస్తూ కనిపించాయి. పామాయిల్, అరటి, వరి పంటలు ఏనుగుల సంచారంతో దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ సిబ్బంది వాటి కదలికలను చూసి రైతులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. రాత్రి సమయాలలో గ్రామంలోకి చొచ్చుకువచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పక్కా ప్రణాళికతో చదువుకోవాలి

- జిల్లా బీసీ సంక్షేమాధికారి సందీప్‌కుమార్

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదువుకుని మంచి మార్కులు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి కె.సందీప్‌కుమార్ అన్నారు. అసిస్టెంట్ బీసీ వె ల్ఫేర్ ఆఫీసర్(అర్బన్) వి.రాజులమ్మ ఆధ్వర్యంలో స్థానిక కస్పా హైస్కూల్‌లో బీసీ సంక్షేమ శాఖ వసతిగృహాల పదవ తరగతి విద్యార్థుల కు ప్రేరణ, అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. శతశాతం ఉత్తీర్ణత సాధించటానికి కావాల్సిన మార్గదర్శకాలను వివిధ పాఠశా లల నుంచి విద్యా విషయక నిపుణులచే బోధించారు. కార్యక్రమంలో వార్డెన్లు డి.జానకీరావు, ఎండ అప్పన్న, బి.అప్పలకొండ, జి.శ్రీదేవి, సిహెచ్‌వి.రమణి, జగదాంబ, టివి.రమ ణ, పి.కన్నంనాయుడు, ఆర్.సత్యనారాయణ, నిపుణులు ఎం.ప్రసాద్, టి.భారతి, ఎం.హేమామాలిని, రాజు, ఎ.రామప్రసాద్, జి.న్యాసినాయుడు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.